

రోడ్డు వెడల్పు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

రోడ్డు విస్తరణలతో ట్రాఫిక్ ఇబ్బందులకు చెక్

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సరూరనగర్ చెరువు కట్టపై ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించేందుకు బ్రిడ్జి వెడల్పు పనులను ప్రారంభించేందుకు సన్నాహాలు చేయాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అధికారులకు సూచించారు. గురువారం సరూర్‌నగర్ చెరువుకట్ట వద్ద నూతనంగా నిర్మించనున్న బ్రిడ్జి వెడల్పు పనులను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించేందుకు చేపట్టాల్సిన చర్యలపై నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో అధ్యయనం చేశామన్నారు. సరూర్‌నగర్ చెరువుకట్ట, పోస్ట్ ఆఫీస్ చౌరస్తా, గాంధీబొమ్మ దగ్గర రోడ్డు విస్తరణ పనులు చేపట్టడం మూలంగా ట్రాఫిక్ ఇబ్బందులను అధిగమించవచ్చన్నారు. ఆయా ప్రాంతాల్లో ఒక్కొక్కటిగా విస్తరణ పనులు చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ఈఈ శ్రీనివాస్, ఏఈ ప్రశాంతి, గడ్డిఅన్నారం మాజీ కార్పొరేటర్ భవానీప్రవీణ్, నాయకులు కందికంటి శ్రీధర్‌గౌడ్, పటేల్ రమణారెడ్డి, యాదా శంకర్, విక్కీ, శివరాం, ప్రదీప్ పాల్గొన్నారు.



కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ ప్రశాంత్ తదితరులు

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు బీపీడీఏవీ విద్యార్థులు

చంపాపేట, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఈ నెల 14వరకు సిద్దిపేటలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు కంచన్‌బాగ్ మిధానీ టౌన్‌షిప్‌లోని బీపీడీఏవీ విద్యార్థులు పూజిత, రషిత, హాసిని, నిషిత, సంజన, సహస్ర ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ వీఎస్.ప్రశాంత్ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల చైర్మన్ గౌరీశంకర్‌రావు, డీఏవీ పాఠశాల ఏఆర్ఓ వసంత ఎస్ రామన్, ప్రిన్సిపాల్, ఎల్ఎంసీ సభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సినీహీరో ఆకాష్ పూరీ

ధ్యానాంజనేయస్వామిని దర్శించుకున్న ఆకాష్ పూరీ

చంపాపేట, జనవరి 11(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో నిత్య పూజలందుకుంటున్న ధ్యానాంజనేయస్వామిని గురువారం ప్రముఖ దర్శకుడు పూరీ జగన్నాథ్ తనయుడు ఆకాష్ పూరీ దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆకాష్ పూరీకి ఆశీర్వచనాలు అందించి స్వామి వారి ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయంలో కర్మన్‌ఘాట్‌లోని యంకే చిట్‌ఫండ్ ఎండీ మహేష్ కొనెదల రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆలయ ఈవో ఎం.శ్రీనివాసశర్మతో కలిసి హీరో ఆకాష్ పూరీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈవో ఎం.శ్రీనివాసశర్మ, బీఆర్ఎస్ ఎల్బీనగర్ యూత్‌వింగ్ అధ్యక్షుడు, నటుడు రవి ముదిరాజ్, ఆలయ ధర్మకర్తలు మేక సురేందర్‌రెడ్డి, ఆనంద్‌కుమార్ గౌడ్, చీర తిరుమలేష్, చేగోని సురేష్‌గౌడ్, అర్చకులు కుర్మేటి అంబప్రసాద్, ప్రవీణ్‌శర్మ, అనంతరామశర్మ, శ్రీనివాస్‌శర్మ పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జైళ్ల శాఖ డీజీ డాక్టర్ డి.శ్రీనివాస్

యూత్ ఫర్ యాంటీ కరప్షన్ క్యాలెండర్ ఆవిష్కరణ

సైదాబాద్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ క్యాలెండర్‌ను గురువారం చంచల్‌గూడ జైళ్ల శాఖ కార్యాలయంలో డీజీ డాక్టర్ డి.శ్రీనివాస్, జైలు సూపరింటెండెంట్ నవాబ్ శివకుమార్‌గౌడ్ ఆవిష్కరించారు. అవినీతి రహిత సమాజం కోసం యువతరాన్ని ఏకం చేసే దిశగా యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ముందుకు నడవాలని వారు సూచించారు. కార్యక్రమంలో సంస్థ ఫౌండర్ రాజేంద్ర, దేవేందర్, రమేశ్‌బాబు, జంగయ్య పాల్గొన్నారు.

దివ్యాంగ యువత స్వావలంభనపై సెమినార్ నేడు

కొత్తపేట, జనవరి 11(ఆంధ్రజ్యోతి): జాతీయ యువజన దినోత్సవం, స్వామి వివేకానంద 161వ జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం కొత్తపేట మోహన్‌నగర్‌లోని చిన్నారుల ఆరోగ్య, వైకల్యాల అధ్యయన సంస్థ - మానసలో దివ్యాంగ యువత - స్వావలంభనపై సెమినార్ నిర్వహించనున్నట్లు డైరెక్టర్ మెర్సీ మధురిమ తెలిపారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యులు సయని విజయభారతి ముఖ్య అతిథిగా, గౌరవ అతిథిగా ఆంధ్రప్రదేశ్ పూర్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ డాక్టర్ దాసరి శ్రీనివాసులు పాల్గొంటారని ఆమె పేర్కొన్నారు.

అన్ని రంగాల్లో దూసుకుపోతున్న మహిళలు : ఉప్పల



మహిళా సంఘం ప్రతినిధులతో ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

కొత్తపేట, జనవరి 11(ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో దూసుకుపోతున్న మహిళలు అభినందనీయులని అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. కొత్తపేట శ్వేతా గార్డెన్స్‌లో గురువారం ఓం శ్రీ మాత్రే నమః మహిళా సంఘం ద్వితీయ వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సంఘం అధ్యక్షులు మంజుల అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పురుషులకు ధీటుగా రాజకీయ, సామాజిక, వ్యాపార రంగాల్లో ముందుకు సాగుతున్నారన్నారు. చైతన్యపురి కార్పొరేటర్ నర్సింహగుప్తా, సంఘం ప్రతినిధులు చకిలం స్వప్న, యాక్టర్ శ్రీనివాస్, కుమార్, బాలరాజ్‌గుప్తా, జయప్రకాష్‌రావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్ : టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఆస్మాన్‌ఘడ్ డివిజన్ పరిధిలోని మరమ్మతు పనుల కారణంగా శుక్రవారం 11కేవీ శ్రీపురం ఫీడర్ పరిధిలోని పరిసర ప్రాంతాల్లో ఉదయం 9నుంచి11 గంటల వరకు, దిల్‌సుఖ్‌నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 9నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, మూసారాంబాగ్ ఫీడర్ పరిధిలోని పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ తెలిపారు.

డేటా ఎంట్రీలో ఇబ్బందులు

ఓల్డ్‌మలక్‌పేట జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన దరఖాస్తుల డేటా ఎంట్రీ ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పూర్తయ్యేది కష్టమే. ఎందుకంటే డేటా ఎంట్రీలో సర్వర్ డౌన్ సమస్య ఏర్పడుతుంది. ఆపరేటర్లు ఎంట్రీ చేయలేక ఇబ్బందులు పడుతున్నారు. గురువారం మలక్‌పేట సర్కిల్-6 పరిధిలో 2 వేల దరఖాస్తులు ఎంట్రీ చేయలేక పోయారు. ప్రారంభించిన కొద్దిసేపటికే సర్వర్ డౌన్ సమస్య నెలకొంది. దీంతో ఆపరేటర్లు ఎంట్రీలు చేయలేక సతమతమయ్యారు. సాంకేతిక సమస్య కారణంగా అనుకున్నమేర ఎంట్రీ చేయలేకపోతున్నారు. ప్రతి పది నిమిషాలకు సర్వర్ సతాయిస్తుండడంతో ఆపరేటర్లు అసహనానికి గురవుతున్నారు. ఒక్కో ఎంట్రీకి చాలాసమయం పడుతుండడంతో ఓపిక నశించి కొంత మంది ఆపరేటర్లు ఎంట్రీలు ఆపేసి ఇంటికి వెళ్లిపోతున్నారు.



ప్రజాపాలన దరఖాస్తులను డేటా ఎంట్రీ చేస్తున్న ఆపరేటర్లు (ఫైల్)

గడువు లోగా పూర్తయ్యేది కష్టమే..

ఇలా అయితే ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా దరఖాస్తులు ఆన్‌లైన్ చేయడం కష్టమే 13 తేది లోగా డేటా ఎంట్రీ పూర్తి చేయాలని ఉన్నతాధికారుల ఆదేశం మరోవైపు సర్వర్ డౌన్‌తో అనుకున్న మేర ఎంట్రీలు కావడంలేదని కిందిస్థాయి అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్కిల్-6 పరిధిలో ఓల్డ్‌మలక్‌పేటలోని అఫ్జల్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో, చార్మినార్ దగ్గరలోని రాయల్‌ఉమెన్ డిగ్రీ కాలేజీలో రెండు చోట్ల ఎంట్రీ కొనసాగుతుంది. ఇప్పటి వరకు 33శాతం పూర్తయింది. సర్వర్ డౌన్ కారణంగా డేటా ఎంట్రీ అనుకున్నమేర జరగడంలేదు. అభయహస్తం కింద 72,469 దరఖాస్తులు రాగా అందులో ఇప్పటి వరకు 26,100 మాత్రమే ఆన్‌లైన్ చేశారు.

సర్వర్ డౌన్ సమస్య తలెత్తుతోంది..

ఆదివారంలోగా ఆన్‌లైన్ పూర్తిచేయాలని ఉన్నతాధికారుల ఆదేశం. సర్వర్ డౌన్ సాంకేతిక సమస్య వల్ల ఆన్‌లైన్ మందకొడిగా సాగుతుంది. సమయం చాలా పడుతుంది. తొందరగా పూర్తి చేసేందుకు ఉదయం, రాత్రి రెండు షిఫ్టులు ఎంట్రీ చేయిస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా ఎంట్రీ కొనసాగుతుండడంతో సర్వర్ నెమ్మదిస్తుంది.

- మలక్‌పేట సర్కిల్ డీసీ జయంత్

వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెంకటకృష్ణ డిమాండ్

హయత్‌నగర్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర సమరయోధుడు వడ్డె ఓబన్న 217వ జయంతిని శుక్రవారం తుర్కయంజాల్ చౌరస్తా వద్ద ఘనంగా నిర్వహించారు. స్థానిక వడ్డెర వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో వడ్డె ఓబన్న చిత్రపటానికి రాష్ట్ర వడ్డెర సంఘం గౌరవ అధ్యక్షుడు కుంచం వెంకటకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లపు విఘ్నేష్‌లు ముఖ్య అతిథిగా హాజరై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉయ్యాలవాడ నర్సింహారెడ్డికి సర్వసైన్యాధ్యక్షుడిగా ఉండి బ్రిటీష్ వారితో గెరిల్లా యుద్ధం చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. దేశానికి స్వాతంత్రం వచ్చిన 76 సంవత్సరాల తర్వాత ప్రభుత్వం వడ్డె ఓబన్నను గుర్తు చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయంగా, ఆర్థికంగా వెనుకబడిన వడ్డెర కులస్థులను ఆదుకోవడానికి ప్రభుత్వం వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. వృత్తిదారులకు భీమా సౌకర్యం కల్పించాలన్నారు. గుట్టలపైన, క్వారీలపైన పూర్తి హక్కులను అందించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ జేరంగుల రామకృష్ణ, వడ్డెర వృత్తిదారుల సంఘం నాయకులు నర్రా భిక్షపతి, ఓర్సు శ్రీనివాస్, వినయ్, సైమన్, గండికోట సత్యం, కృష్ణ, బాలకృష్ణ, వేముల మల్లేష్, ముత్క శ్రీనివాస్, సందీప్, శ్రీధర్, శ్రీకాంత్, అంజి, రాకేష్, ప్రసాద్, అనురాగ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



తుర్కయంజాల్‌లో వడ్డె ఓబన్న చిత్ర పటానికి నివాళ్లు అర్పిస్తున్న వడ్డెర వృత్తిదారుల సంఘం నాయకులు

జాతీయ రహదారిపై డ్రైవర్ల ఆందోళన

- వాహనాలను అడ్డుకుని ధర్నా.. బీఎన్ఎస్ చట్టంలో నిబంధనలు సవరించాలని డిమాండ్

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన బీఎన్ఎస్ చట్టంలోని నిబంధనలను సవరించాలని డిమాండ్ చేస్తూ గురువారం పెద్దఅంబర్‌పేట్ లారీ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఓఆర్ఆర్ వద్ద విజయవాడ జాతీయ రహదారిపై ఆందోళన నిర్వహించారు. పెద్ద ఎత్తున హాజరైన డ్రైవర్లు జాతీయ రహదారిపై బైఠాయించి జాతీయ రహదారిపై వెళ్తున్న వాహనాలను అడ్డుకుని ధర్నా నిర్వహించారు. చట్టంలోని నిబంధనలను వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. డ్రైవర్ల జీవితాలతో ఆడుకోవద్దని హెచ్చరించారు. చాలీచాలనీ జీతాలతో డ్రైవర్లుగా జీవనం సాగిస్తుంటే కేంద్ర ప్రభుత్వం హిట్ అండ్ రన్ చట్టంతో డ్రైవర్లు ఆగమయ్యే పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం డ్రైవర్లకు న్యాయం జరిగే విధంగా చట్టంలో మార్పులు తీసుకురావాలని కోరారు. జాతీయ రహదారిపై డ్రైవర్ల ధర్నాతో 2 కిలోమీటర్ మేర ట్రాఫిక్‌జాం అయింది. ఈ విషయం తెలుసుకున్న హయత్‌నగర్, ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకుని డ్రైవర్లతో మాట్లాడి ధర్నాను విరమింపచేశారు. అనంతరం ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కార్యక్రమంలో డ్రైవర్లు కృష్ణ, మల్లేష్, మహేందర్, చక్రవర్తి, భిక్షపతి, జంగయ్య, అంజిరెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.



పెద్దఅంబర్‌పేట్ ఓఆర్ఆర్ వద్ద జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న లారీ డ్రైవర్లు

సంక్రాంతి ముగ్గుల పోటీలు

సరూర్‌నగర్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని 9వ డివిజన్ నందిహిల్స్ బస్టాప్ వద్ద సంక్రాంతి పండుగ నేపథ్యంలో నందిహిల్స్ ఫేజ్-1 సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. దాదాపు వంద మందికి పైగా మహిళలు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉత్తమ ముగ్గులను ఎంపిక చేసి విజేతలను ప్రకటించారు. వారికి 9వ డివిజన్ కార్పొరేటర్ పెండ్యాల శివపార్వతీనర్సింహ, 26వ డివిజన్ కార్పొరేటర్ పెండ్యాల నర్సింహ హాజరై బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న కార్పొరేటర్ దంపతులు శివపార్వతీనర్సింహ

ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలి : రాజ్యలక్ష్మి

చంపాపేట, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులు రాజకీయ రంగంతో పాటు ఇతర రంగాల్లో రాణించాలని బీజేపీ రాష్ట్ర మహిళా విభాగం కోశాధికారి ఉప్పల రాజ్యలక్ష్మి అన్నారు. చంపాపేట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం సంఘం కార్యాలయ ఆవరణలో మహిళలకు సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించారు. పోటీల్లో మొదటి బహుమతి విజిత, రెండవ బహుమతి బోనగిరి శశి, మూడవ బహుమతి కొమరశెట్టి స్వాతికి రాజ్యలక్ష్మి బహుమతులను అందజేశారు. పోటీల్లో పాల్గొన్న 16మంది మహిళలకు కన్సొలేషన్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సరిత, ఊరే రవీందర్, అన్నదాన కమిటీ కన్వీనర్ విజయనాథ్ గుప్తా, ప్రధాన కార్యదర్శి బచ్చు మహేష్‌గుప్తా, గౌరవాధ్యక్షుడు సాయి రాంగుప్తా, సభ్యులు జగన్‌గుప్తా, మధు, సతీష్, రవీందర్ పాల్గొన్నారు.



చంపాపేటలో ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఉప్పల రాజ్యలక్ష్మి

సంకాంత్రి సంబరాలు

సైదాబాద్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కరన్‌బాగ్‌లోని కేంబ్రిడ్జి స్కూల్‌లో ముం దస్తు సంకాంత్రి సంబరాలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు వివిధ వేశధారణలతో, పల్లె వాతావరణం అద్దం పట్టినట్లు ప్రదర్శించిన కళానైపుణ్యం అందరిని అబ్బుర పరిచింది, చిన్నారులకు భోగిపళ్ల పోయుట, విద్యార్థుల నృత్యాలు మురిపించాయి.

హెల్మెట్ల పంపిణీ

హైదరాబాద్ సిటీ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో జరిగిన రోడ్డు సేఫ్టీ కార్యక్రమంలో భాగంగా గురువారం 390 హెల్మెట్లు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. పాతనగరంలోని 3 పాఠశాలల్లో ఈ కార్యక్రమం జరిగింది. బండ్లగూడలోని స్లివర్క్ రెస్ట్ స్కూల్, హాషమాబాద్‌లోని ఉరూజ్ మోడల్ స్కూల్, చాంద్రాయణగుట్టలోని ఉరూజ్ స్కూల్‌లో పంపిణీ చేశారు.



వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి అదృశ్యం



సంతోష్‌నగర్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఇంట్లో కుటుంబ సభ్యుల కు చెప్పకుండా బయటకు వెళ్లిన మహిళ అదృశ్యమైన ఘటన ఐఎస్‌సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఐఎస్‌సదన్ డీఎస్‌నగర్‌కు చెందిన అంజమ్మ(60) సోమవారం ఉదయం 8గంటలకు ఇంట్లో కుటుంబ సభ్యులకు చెప్పకుండా బయటికి వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు చుట్టు పక్కల తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ప్రయోజనం లేకపోవడంతో కూతురు రమణ ఐఎస్ సదన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు 8712661583 నంబర్‌లో సంప్రదించాలని ఎస్ఐ అశోక్ కోరారు.

సైదాబాద్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మొబైల్ ఫోన్ కొనివ్వనందుకు ఓ మహిళ అలిగి ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగిరాకపోవడంతో భర్త మాదన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చంచల్‌గూడకు చెందిన మహ్మద్ రషీద్ ఖాదర్(57) వృత్తిరీత్యా ప్లంబర్, మూడు నెలల క్రితం బార్కాస్‌కు చెం దిన హనీఫా బేగం(55)ను రెండో వివాహం చేసుకున్నాడు. ఈ నెల7న రూ.8వేల విలువ గల మొబైల్ ఫోన్ కొనివ్వమని భర్తను అడిగింది. అతడు తిరస్కరించాడు. దీంతో ఆమె అలిగి ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో భర్త మాదన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.





సైదాబాద్ : ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ వృద్ధుడు కనిపించకుండా పోవడంతో కుటుంబసభ్యులు మాదన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. యాఖత్‌పురా బాగే జహారాలో నివాసముండే మహ్మద్ ఇస్మాయిల్(64) ఈనెల 6న ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మా ఫ్యామిలీ చెట్టుపై ఉంది..

- భారీ చెట్టు ఎక్కి యువకుడి హల్‌చల్

బౌద్ధనగర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): 'మా ఫ్యామిలీ చెట్టుపై ఉంది..' ఉంటూ ఓ యువకుడు భారీ చెట్టు ఎక్కి. హల్‌చల్ చేశాడు. సుమారు రెండు గంటల పాటు పోలీసులను ముప్పుతిప్పలు పెట్టాడు. డీఆర్ఎఫ్, ఫైర్ సిబ్బంది, పోలీసులు అందరూ కలిసి అతడిని అతికష్టం మీద కిందికి దించారు. అతడి మాటలను బట్టి మతిస్థిమితం లేనట్లుగా గుర్తించారు. ఈ సంఘటన గురువారం మధ్యాహ్నం చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ మట్టంరాజు, అడ్మిన్ ఎస్సై బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. అమర్‌టాకీస్ గల్లీ వద్ద ఓ యువకుడు అతిపెద్ద చెట్టు ఎక్కి, ఆత్మహత్య చేసుకోబోతున్నట్లు చిలకలగూడ పోలీసులకు సమాచారమందింది. ఇన్‌స్పెక్టర్ మట్టంరాజు, అడ్మిన్‌ఎస్సై బాలరాజు సిబ్బందితో కలిసి అక్కడకు చేరుకున్నారు. చెట్టు దిగమంటూ అతడిని కోరారు. చెట్టుపై ఉన్న యువకుడు ఏదేదో మాట్లాడుతున్నాడు. అతడిని మాటల్లో పెట్టి డీఆర్ఎఫ్, ఫైర్ సిబ్బంది క్రేన్ సహాయంతో కిందికి దించారు. వివరాలు అడిగితే తనపేరు రబీందర్, చత్తీస్‌గఢ్ అని చెప్పాడు. చెట్టు ఎందుకు ఎక్కావు అంటే తమ ఫ్యామిలీ చెట్టుపై ఉందంటూ ఇది నాగపూర్ కాదా.. అని పోలీసులను ప్రశ్నించాడు. పోలీసులు యువకుడిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అతడిని చాకచక్యంగా కిందికి దించిన సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.



చెట్టుపై యువకుడు



మన్సూరాబాద్ డివిజన్ కళ్లెం ఎల్లారెడ్డి కాలనీలో శుక్రవారం అయోధ్య రామాలయం అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిగా వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి రావినూతల శశిధర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, మాజీ కౌన్సిలర్ కళ్లెం రవీందర్‌రెడ్డితో పాటు కాలనీ ప్రజలు పాల్గొన్నారు. - హయత్‌నగర్, ఆంధ్రజ్యోతి

బలిజగూడలో వికాసిత్ భారత్ సంకల్పయాత్ర

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బలిజగూడలో గురువారం వికాసిత్ భారత్ సంకల్పయాత్ర జరిగింది. ఈ సందర్భంగా అబ్దుల్లాపూర్‌మెట్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వ్యవసాయ అధికారులు రైతులకు పలు సలహాలు సూచనలు అందించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బుర్ర వీరస్వామిగౌడ్, ఉప సర్పంచ్ సురేష్, సీబీఐ బ్యాంక్ మేనేజర్ ఉషాకిరణ్, వెంకటేష్, వీరేశం, రాధిక పాల్గొన్నారు.

అన్నదానం

చంపాపేట, జనవరి 11(ఆంధ్రజ్యోతి): చంపాపేటలోని పోచమ్మ ఆలయం ఎదుట గురువారం మాతా అన్నపూర్ణేశ్వరీ ట్రస్ట్ చైర్మన్ భగవాన్ ఆధ్వర్యంలో అమావాస్యను పురస్కరించుకొని 350 మందికి అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు రవిముదిరాజ్, సుశీల్‌కుమార్, సంతోష్ ఎలడ్డా, ప్రవీణ్, చింటూ, శ్రీనివాస్, రాజు, దుర్గేందర్, షాన్‌వాజ్, సంజీవ్, వెంకటేష్, మనోహర్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

చంపాపేట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం అమావాస్యను పురస్కరించుకొని 400 మందికి అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో అమావాస్య అన్నదాన కమిటీ చైర్మన్ విజయనాథ్‌గుప్తా, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రవీందర్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి బచ్చు మహేష్‌గుప్తా, సభ్యులు ఎలకుర్తి జగన్, మధు పాల్గొన్నారు.

మలక్‌పేట మార్కెట్‌లో..

ఓల్డ్‌మలక్‌పేట : అమావాస్యను పురస్కరించుకొని మలక్‌పేటలోని వ్యవసాయ మార్కెట్(గంజ్)లో ఆర్యవైశ్య మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం అన్నదానం చేశారు. మార్కెట్ సిబ్బందితో పాటు మార్కెట్‌కు వచ్చేవారు కిరాణా షాపు నిర్వాహకులు సుమారు వెయ్యిమంది అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ప్రతి అమావాస్య రోజు ఇక్కడ అన్నదానం చేస్తున్నట్లు చెబుతున్నారు.

మద్యం మత్తులో వాహనాలు నడిపిన ఇద్దరికి జైలు

కొత్తపేట, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఎల్‌బీనగర్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వారిలో ఇద్దరికి రంగారెడ్డి జిల్లా కోర్టు జైలుశిక్ష విధించిందని ఇన్‌స్పెక్టర్ డీ.నర్సింగ్‌రావు తెలిపారు. ఉప్పల్‌కు చెందిన సారంగం(27), వనస్థలిపురం వాసి సీహెచ్.బాలాజీ(42) డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డారని, ఇద్దరూ మోతాదుకు మించి మద్యం సేవించి వాహనాలు నడిపినట్లు నిర్ధారణ కావడంతో వారిద్దరికి జిల్లా 6వ స్పెషల్ ఎంఎం కోర్టు జడ్జి మంజుల 3 రోజుల జైలు శిక్ష విధించారని పేర్కొన్నారు.



జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం దక్కించుకున్న విద్యార్థులను అభినందిస్తున్న సిల్వర్ డ్రాప్స్ చైర్మన్ శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది

జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో 'సిల్వర్ డ్రాప్స్'కు ద్వితీయ బహుమతి

సరూర్‌నగర్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నంలోని గురుకుల్ విద్యాపీఠ్‌లో బుధవారం నిర్వహించిన రంగారెడ్డి జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడలో గల సిల్వర్ డ్రాప్స్ హైస్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన చంద్రయాన్-3 లాంచింగ్, ఫుడ్ చెయిన్ అండ్ ఇన్నోవేషన్ అంశాలు అందరినీ ఆకట్టుకున్నాయి. 6,7 తరగతులకు చెందిన విద్యార్థులు ఆస్తాశుక్లా, హాసిని, అలేఖ్య, షణ్ముఖ తదితరులు ఆయా అంశాలను ప్రదర్శించి అతిథులకు, సందర్శకులకు చక్కగా వివరించారు. ఈ క్రమంలో న్యాయ నిర్ణేతలు వారిని ద్వితీయ స్థానానికి ఎంపిక చేశారు. కాగా గురువారం జిల్లెలగూడలోని స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ జె.శ్రీనివాస్‌రావు వారిని అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు, ఉపాధ్యాయులు స్వప్న, కామేశ్వరి, దివ్య, మాధవి పాల్గొన్నారు.

బాలికపై ఆగని వేధింపులు

- దంపతులపై కేసులు నమోదు

యూసుఫ్‌గూడ : బాలికను వేధించినందుకు ఓసారి జైలుకు వెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చి మళ్లీ వేధింపులకు పాల్పడుతున్న దంపతులపై మరోసారి మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం.. నగరంలో నివసించే ఓ వ్యక్తి కుమార్తెను గతేడాది సెప్టెంబర్ నెలలో ఆంజనేయులు, రామేశ్వరి(రమ) దంపతులు కిడ్నాప్ చేశారు. ఈ ఘటనలో రామేశ్వరిపై కిడ్నాప్ కేసు, ఆంజనేయులుపై ఫోక్సో కేసు నమోదు చేసి జైలుకు పంపారు. బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు. కాగా, నిందితులు బెయిల్‌పై బయటకు వచ్చారు. బాధిత బాలిక స్కూల్‌కు వెళ్లి వచ్చేటప్పుడు ఆంజనేయులు, రామేశ్వరి ఇద్దరు వెంబడిస్తున్నారని, ఫోన్ చేయాలని సైగ చేస్తున్నారని ఈ నెల 10న కౌన్సెలింగ్ సందర్భంగా బాలిక తెలిపింది. ఈ మేరకు శుక్రవారం ఫిర్యాదు చేయటంతో మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై శివకుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.